క్లుప్తంగా

ఆహార జాగ్రత్తలతోనే రక్తహీనత దూరం



ఫిరంగిపురం: గర్భిణులు ఆహారం తీసుకునే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, 104 వైద్య సిబ్బందితో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 62 మందికి వైద్య పరీక్షలు బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులకు ఈసీ, రక్తపూత, బీపీ పరీక్షలు చేసి రక్తహీనత లేకుండా ఉండటానికి తీసుకోవాల్సి ఆహార జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు సుజాత, నాగరత్నం, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అవార్డుల ప్రదానం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో పూర్వవిద్యార్థుల విభాగం అవార్డులు–2023 కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పూర్వ విద్యార్థుల విభాగ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కావ్య మాట్లాడుతూ విభిన్న రంగాల్లో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న పూర్వ విద్యార్థులకు అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించామని అన్నారు. కార్యక్రమంలో ప్రొ. వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, అంతర్జాతీయ సంబంధాల విభాగ డైరెక్టర్ ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.శరత్, తదితరులు పాల్గొన్నారు.

చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కిషోర్‌కుమార్

తాడేపల్లిరూరల్: ఏపీ చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షులుగా దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామానికి చెందిన కొండూరు కిషోర్‌కుమార్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు నియామక పత్రాన్ని మంగళగిరిలోని ఏపీ చర్మకార సంక్షేమ సంఘం కార్యాలయంలో కిషోర్‌కుమార్‌కు అందజేశారు. కిషోర్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని చర్మకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేస్తానని, చర్మకారులకు ప్రభుత్వం వచ్చే రుణాలు, పథకాలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు.

పోషకాహారం, వ్యాయామంతో వ్యాధుల నుంచి విముక్తి

గుంటూరు ఎడ్యుకేషన్: పోషకాహారం, వ్యాయామం, మంచి నడవడికతో వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని త్రిగుణ హెల్త్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమా సుందరి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని జీఎస్ఆర్ మోడల్ స్కూల్లో పూణేలోని జాతీయ ప్రకృతి వైద్య సంస్థ ఆధ్వర్యంలో రోగ యుక్త భారత్- ప్రకృతి వైద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ అమరేశ్వరరావు విద్యార్థులతో చిరు వ్యాయామం చేయించారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేసి, విద్యార్థులకు ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు జి.శివారెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నెహ్రూనగర్: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ గుంటూరు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్మయ్ దేవిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీస్ గ్లోబల్ ఇంపాక్ట్ - రెలవన్స్ ఆఫ్ గాంధీయన్ థాట్ ఇన్ టుడే స్ వరల్డ్ అనే అంశంపై హిందీ, ఇంగ్లిష్‌లో మాత్రమే వకృత్వ జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 15వ తేదీ నిర్వహించబడుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 18 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాలు మధ్య గలవారై, ఉమ్మడి గుంటూరు వాసులై ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక కాబడిన యువత అక్టోబర్ 2న పార్లమెంట్ హౌస్, న్యూఢిల్లీలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వివరాల కోసం ఈ నెల 14న గుంటూరు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయాన్ని, కార్యాలయ పనివేళల్లో 6303677849 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నీట మునిగిన వాణిజ్య పంటలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌తోపాటు దుగ్గిరాల మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వాణిజ్య పంట పొలాల్లో కొన్ని చోట్ల వర్షపునీరు భారీగా నిలబడింది. ఉండవల్లిలోని అమరావతి కరకట్టకు పెద్ద డొంకకు మధ్య వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలేక సుమారు 10 ఎకరాలలో కూరగాయ తోటలు, పండ్ల తోటలు నీట మునిగాయి. పెనుమాక అమరావతి రోడ్డు వెంబడి ఉండవల్లి అనంత పద్మనాభస్వామి గుహలు దాటిన తరువాత అక్కడక్కడ రైతులు తమ పంట పొలాల్లో మెరక లేపడంతో కృష్ణాయపాలెం, పెనుమాక రోడ్డు దగ్గర నుండి ఉండవల్లి వరకు అరటి, మొక్కజొన్న, బెండ, జామ, బొప్పాయి ఇతర పంటపొలాలు నీటిలో మునిగాయి. దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు బకింగ్‌హామ్ కెనాల్ పక్కన ఉన్న అరటితోటలు, కంద, పసుపు నీట మునిగాయి.

మెల్లెంపూడి తుంగభద్ర డ్రెయినేజీ పక్కన ఉన్న పంటపొలాలు వర్షపు నీరు వెళ్లే మార్గం లేక నీట మునిగాయి. మొత్తం మీద 100 ఎకరాల వరకు లోతట్టు ప్రాంతంలో ఉన్న వాణిజ్య పంట పొలాలు మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఇంతటితో ఆగిపోతే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసి పంట చేతికొస్తుందని లేదంటే వేరు కుళ్లు వచ్చి పంట పూర్తిగా పాడైపోతుందని రైతులు తెలిపారు.



ఉండవల్లిలో నీట మునిగిన బెండతోట

పండ్లతోటల పెంపకంతో పేదలకు ఉపాధి

ఉపాధి హామీ ఈసీ ప్రభాకర్

ఫిరంగిపురం: పండ్లతోటల పెంపకంతో పేద రైతులకు ఉపాధి చేకూరుతుందని ఉపాధి హామీ ఈసీ ప్రభాకర్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో రైతులు నాటుతున్న తైవాన్ జామ మొక్కలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మేరికపూడి, గొల్లపాలెం, మునగపాడు, నుదురుపాడు, బేతపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు గ్రామాల్లో 2023–24సంవత్సరానికిగాను 44 ఎకరాలలో పండ్లతోటల పెంపకం కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వారికి తైవాన్ జామ, మామిడి, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, మునగ, గులాబీ తోటలు పెంపకానికి అవసరమైన నిధులు ప్రభుత్వం ద్వారా అందజేసినట్లు తెలిపారు. గతేడాది వరకు 32 ఎకరాలల్లో మాత్రమే రైతులు పండ్లతోటల పెంపకం చేపట్టగా ఈ ఏడాది 44 ఎకరాల్లో తోటల పెంపకానికి ఉత్సాహంగా ముందుకు వచ్చారని చెప్పారు. తోటలు వేసినప్పటి నుంచి మూడేళ్లపాటు తోట రకాలు, విస్తీర్ణాన్ని బట్టి పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకరంగా ప్రభుత్వం ప్రతి రైతుకు మూడేళ్లపాటు రూ.80 వేల నుంచి లక్షా ఇరవైవేల వరకు ప్రోత్సాహక నగదు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



తైవాన్ జామ మొక్కలు పరిశీలిస్తున్న ఉపాధి హామీ ఈసీ ప్రభాకర్

పడవల రేవులో ఐరన్ చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఇసుక రీచ్‌లో ఉన్న పడవల రేవులో ఉన్న పడవల సామగ్రి చోరీకి గురవుతున్నాయి. తాడేపల్లి పోలీసులకు పడవల యజమాని మంగళవారం ఫిర్యాదు చేశాడు. పడవల యజమాని సదాశివరావు తెలిపిన వివరాలు... ఉండవల్లి పాత ఇసుక రీచ్‌లో పడవలను నాలుగు సంవత్సరాలుగా నిలిపివేశామని, ఆ పడవలకు సంబంధించిన మోటర్లు, ఇతర వస్తువులు ప్రతి రోజూ చోరీకి గురవుతున్నాయని, సోమవారం కొన్ని సామానులను దొంగతనం చేసే విధంగా అందుబాటులో ఉంచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, గుర్తు తెలియని వ్యక్తి కారులో వచ్చి ఆ సామానులు తీసుకెళ్లినట్లు తెలిపారు. కారు నంబర్ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుంచనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం కుంచనపల్లి, కొలనుకొండ, గుండిమెడ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి అమ్మవార్లకు అభిషేకార్చన

పాతగుంటూరు: అరండల్‌పేటలోని అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా కోటి కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం గోపూజ, శ్రీ చక్ర మేరుకు అభిషేకాలు అనంతరం అష్టలక్ష్మి అమ్మవార్లకు 108 కేజీల గంధంతో విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పంతో అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ కోటి కుంకుమార్చన ముగింపుగా బుధవారం అమ్మవార్లకు లక్ష గాజుల పూజ, శాంతి హోమం మహాపూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.

జాతీయ యోగాసన పోటీల్లో సత్తా చాటిన రావెల జెడ్పీ విద్యార్థినులు

- జాతీయ పోటీలకు అర్హత సాధించిన వెంకట త్రివేణి
- రాష్ట్ర స్థాయి పోటీలలో రజతం సాధించిన మొఘల్ ఖాజాబీ

రావెల(తాడికొండ): రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు సత్తాచాటి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎన్‌వీ నాగమణి తెలిపారు. ఈనెల 9–10 తేదీలలో కర్నూలులో నిర్వహిచిన 48వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ చాంపియన్‌షిప్ 16–18 సంవత్సరాల విభాగంలో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పేరుబోయిన వెంకట త్రివేణి ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికకాగా 14–16 సంవత్సరాల విభాగంలో మరో విద్యార్థిని మోఘల్ ఖాజాబీ ఆరో స్థానంతో రజతం సాధించి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిందని తెలిపారు. కర్నూలు వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో బహుమతులు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ఏడాదిగా తమ పాఠశాలలో యోగాసనకు పెద్దపీట వేస్తూ శిక్షకుడు కె రాకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. నిరంతర సాధన చేస్తున్న విద్యార్థులు గతంలో పలు పోటీలలో సత్తా చాటగా నేడు జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి తమ పాఠశాల పేరును ఇనుమడింపజేయడం ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం నాగమణితో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు అభినందించారు.



విద్యార్థిని వెంకట త్రివేణిని అభినందిస్తున్న హెచ్ఎం నాగమణి

ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జిగా రామారావు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగం ఇన్‌చార్జిగా డాక్టర్ పి.రామారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఇటీవల తనిఖీలు చేసిన సమయంలో కుటుంబ నియంత్రణ విభాగంలో ఇన్‌చార్జి లేకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్న విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో ఇన్‌చార్జి నియామకాన్ని చేపట్టారని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కోత, కుట్లు లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

రేడియాలజీ విభాగం తనిఖీ..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రేడియాలజీ విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. రేడియాలజీ ఓపీలో రోగులు ఎక్కువగా ఉండటాన్ని గమనించారు. ఆస్పత్రిలో రెండు స్కాన్ మిషన్‌లు నాలుగు ఎక్స్ రే మిషన్‌లు అందుబాటులో ఉన్నా రోగులు మాత్రం వందల సంఖ్యలో ఉండటంతో విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఒక పీజీ, ఒక రెసిడెంట్ వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉన్నారని ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఎక్స్ రే రిపోర్టులు వెంటనే చూడాల్సిన బాధ్యత అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉందని తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్ఎంఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న డాక్టర్ రామారావు

అవినీతి, మోసాల వల్లే బాబు జైలుపాలు

వైఎస్సార్‌సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



తాడికొండ: అవినీతి, మోసాల వల్లే చంద్రబాబు జైలు పాలయ్యాడని, ఆయన బయట ఉంటే సాక్షులను బెదిరించి, తారుమారు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రమాదం ఉన్నందున జైల్లో ఉంటేనే మంచిదని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు భారత్‌పేటలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు చేసిన అవినీతిని ఆధారాలతో సహా పట్టుకున్నందునే నేడు అరెస్టు చేసి జైల్లో పెట్టారని, కానీ బాబు మాత్రం తనకేమీ తెలియదంటూ ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని తప్పుకునేందుకు యత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. వ్యవస్థలను ప్రభావితం చేస్తూ బాబు 27 కేసుల్లో స్టేలు తెచ్చుకొని బయట తిరుగుతున్నాడని, ఆయన పాపం పండి ఇప్పుడు అరెస్టు అయ్యాడన్నారు. అన్ని ప్రయత్నాలు చేసి జైలుకు వెళ్లకుండా బయటపడాలని చూసిన బాబు ఇప్పుడు రూటు మార్చి తనకు హౌస్ రిమాండ్ కావాలంటూ పిటీషన్ వేయడం సిగ్గుచేటన్నారు. ఆర్థిక నేరాలు చేసిన చంద్రబాబును జైల్లో ఎందుకు పెట్టకూడదో అది ఏ చట్టంలో ఉందో చెప్పాలని, సామాన్యుడికో న్యాయం, బాబుకో న్యాయం అనే చందంగా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సిద్దార్థ లూథ్రా వంటి న్యాయవాదులను తీసుకొచ్చి ఇక్కడ వాదించడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. వెన్నుపోటుకు అలవాటు పడిన బాబు ప్రజాస్వామ్యం ఖూనీ చేయాలని చూసి భంగ పడ్డాడని త్వరలో ఆయనపై ఉన్న అన్ని కేసులను బయటకు తీసి విచారణ చేయాలన్నారు. బాబుపై ఆధారాలు బలంగా ఉన్నందునే సిద్దార్థ లూథ్రా వంటి న్యాయవాదులు సైతం బెయిల్ ఇప్పించలేకపోయారని, ఇక అవినీతి పార్టీ టీడీపీకి భూస్థాపితం తప్పదన్నారు.

మొక్కలు నాటిన జేసీఐ సభ్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్‌రోడ్‌లో మంగళవారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సంస్థ (జేసీఐ) ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేసీఐ జోన్ 4 అధ్యక్షులు జీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ జేసీఐ జైత్ర పేరుతో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా స్థానిక జేసీఐ శాఖ, విజయవాడ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో సర్వీస్‌రోడ్‌లో 100మొక్కలు నాటినట్లు తెలిపారు. ధ్వని కాలుష్యం తగ్గించడానికి వాహనదారులను అనవసరంగా హారన్ మోగించవద్దని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ కో ఆర్డినేటర్ భరత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, రీజియన్ సీ జోన్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్, స్థానిక జేసీఐ శాఖ అధ్యక్షులు స్వాతి, వీక్ కో ఆర్డినేటర్ గణేష్‌బాబు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు లక్కం రవీంద్రరెడ్డి, రవికిరణ్, వీరారెడ్డి, సందీప్, పళ్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొలనుకొండ జాతీయ రహదారి సర్వీస్ రోడ్‌లో మొక్కలు నాటుతున్న జేసీఐ అధ్యక్షులు

ఎట్టకేలకు దొరికిన కొండచిలువ

తాడేపల్లిరూరల్: ఎట్టకేలకు కొండచిలువను మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. కొండచిలువ ఆరు నెలలుగా కోళ్లను తినేస్తూ తప్పించుకుని తిరుగుతోంది. కార్పొరేషన్ పరిధిలోని నులకపేటలో ఉన్న బిస్మిల్లా చికెన్ సెంటర్‌కు అనుసంధానంగా కోళ్ల ఫారం ఉంది. ఆరు నెలలుగా ప్రతి రోజూ కోళ్లు మాయమౌతున్నాయి. రెండు మూడు సార్లు కొండచిలువను షాపు యజమాని నజీర్ చూసి దానిని పట్టుకునేందుకు ప్రయత్నం చేశాడు. రెండుసార్లు తప్పించుకుంది. మంగళవారం కోళ్లఫారంలోకి కొండ చిలువ రావడంతో కోళ్లు అరిచాయి. కోళ్లఫారంలోకి వెళ్లి చూడగా కోళ్లపై దాడిచేసేందుకు కొండచిలువ ప్రయత్నం చేసింది. వెంటనే నులకపేటలో పాములను పట్టుకునే ఆరోగ్యంని పిలిపించగా కొండ చిలువను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అది పైపైకి రావడంతో స్థానికంగా ఉన్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఎట్టకేలకు ఆరోగ్యం ఆ కొండచిలువను బంధించాడు. చేపలను బంధించే ఆపాలో ఆ కొండచిలువను ఉంచగా స్థానికంగా ఉన్న యువకులు కొండచిలువను చూసేందుకు భారీగా చేరుకుని ముడి విప్పదీయడంతో ఒక్కసారిగా పైకి లేచి పరుగులు తీసింది. ఎట్టకేలకు తిరిగి ఆ కొండచిలువను బంధించి బ్రహ్మానందపురంలోని ఫారెస్ట్ ఏరియాలో వదిలిపెట్టారు.



కొండచిలువను పట్టుకున్న ఆరోగ్యం

టేక్ హోం రేషన్ కిట్లు అందజేత

నెహ్రూనగర్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ఇంటికే రేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, దీనిని అర్హులైన లబ్ధిదారులు తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బాలింతలు, గర్భిణీలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహిమర్థిని, అంగన్‌వాడీ సిబ్బంది శ్రీదేవి, ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు

డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యా శాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవానంది నేషనల్ అవార్డ్స్–2023 అందుకున్న లాలుపురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు చివుకుల సాంబశివరావును తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సాంబశివరావు విజ్ఞానంతో వినోద కార్యక్రమాల ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షన్నర మంది విద్యార్థులకు మాథ్స్, సైన్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, జీవీఆర్ పాల్గొన్నారు.



సాంబశివరావును అభినందించిన డీఈఓ శైలజ, యూటీఎఫ్ నాయకులు

నగరంలో పోలింగ్ కేంద్రాల మార్పు

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి అభిప్రాయాలను తెలియజేయాలని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్, పోలింగ్ కేంద్రాల మార్పుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలననుసరించి గుంటూరు నగరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగరపాలక సంస్థ అధికారులు కొన్ని కేంద్రాల చిరునామా, మరి కొన్ని కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదించారని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్‌లను పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. కొన్ని కేంద్రాలు నాడు- నేడు పనుల వలన, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కొనసాగించకపోవడం వలన కేంద్రాలను పూర్తిగా మార్పు చేస్తున్నామని వివరించారు. మరి కొన్ని కేంద్రాల పేర్లు సరి చేశామని పేర్కొన్నారు. తూర్పులో 96, పశ్చిమలో 49 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మార్చడానికి, తూర్పులో 52, పశ్చిమలో 38 కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రెండు రోజుల్లో కేంద్రాలపై అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. అనంతరం నివేదిక జిల్లా ఎన్నికల అధికారికి పంపుతామని చెప్పారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, కోటయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, రాజకీయ పార్టీల నుంచి బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి సిహెచ్.వాసు, సీపీఎం ఖాసిం షహీద్, తెలుగుదేశం పార్టీ ఎస్.ఓంకార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

బ్యాంకర్లు వేగంగా రుణాలు మంజూరు చేపట్టాలి

నెహ్రూనగర్: టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాల మంజూరు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం టిడ్కో లబ్ధిదారులకు రుణాల మంజూరుపై బ్యాంకర్లు, మెప్మా సీఎంఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలో టిడ్కో గృహ సముదాయాలను కేటాయించిన లబ్ధిదారులకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపి రుణాలు మంజూరు వేగంగా చేయాలని కోరారు. కొంత మంది లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో రుణాల మంజూరు నిలిపివేశారని, అటువంటి వారికి కూడా పునః పరిశీలన చేసి రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం త్వరలో టిడ్కో ఇళ్ల ప్రారంభం చేయనున్నదని, మెప్మా సిఎంఎంలు ప్రతి లబ్ధిదారుల నుండి రుణాల కోసం డాక్యుమెంట్స్‌ని సేకరించి బ్యాంక్‌లకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిధర్ రెడ్డి, ఉపా సెల్ పి.ఓ. సాంబశివరావు పాల్గొన్నారు.